క్లుప్తంగా

బాధితుడికి ఆర్థిక సాయం



నాగబాబుకు ఆర్థికసాయం అందజేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మధురపూడి: కోరుకొండ లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవంలో గాయపడిన కాపవరానికి చెందిన నాగబాబుకు బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయలు ఆర్థిక సాయం అందజేశారు. సరస్వతి విద్యాసంస్థ కరస్పాండెంట్ పెనకటి గంగాధరరావు ఆధ్వర్యంలో రూ.1.68 లక్షలు, ఫోన్‌పే ద్వారా మరో రూ.35 వేలు అందించారు. ఆ సంస్థకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం నాగబాబు ఇంటికెళ్లి, పరామర్శించారు.

జోరుగా జగనన్నే మా భవిష్యత్తు



ఎస్టీ రాజాపురంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

రంగంపేట: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం బుధవారం జోరుగా సాగింది. ఎస్టీ రాజాపురం గ్రామంలో సర్పంచ్ అడ్డాల పద్మ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామల్లోని ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటి తలుపులపై యజమానుల అనుమతితో సీఎం జగన్ స్టిక్కర్ అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డాల వెంకటేష్, పప్పు వెంకటేశ్వర్లు, బదిరెడ్డి ఈశ్వరరావు, లోవబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐదు టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత

బిక్కవోలు: మండలంలోని ఆర్ఎస్‌పేట గ్రామంలోని కాటన్ దొర విగ్రహం వద్ద వాహన తనిఖీల్లో ఐదు టన్నుల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వాహనాలు తనిఖీ చేస్తుండగా అనకాపల్లి నుంచి బిక్కవోలు వస్తున్న వ్యాన్‌లో మూడు టన్నులు(70 బస్తాలు), విజయవాడ నుంచి బిక్కవోలు వస్తున్న మరో వాహనంలో రెండు టన్నులు(50 బస్తాలు) పీడీఎస్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ రెండు కేసులకు సంబంధించి కొర్తి వీరబాబు, ఉలవల శివ, కొనసాయి, అనిశెట్టి పోలరాజుల్ని అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

మహిళలకు ఉచిత మగ్గం వర్క్ శిక్షణ



పాత వీరంపాలెంలో శిక్షణకు హాజరైన మహిళలు

రంగంపేట: మండల పరిధిలోని పాత వీరంపాలెం గ్రామంలో మహిళలకు ఉచిత మగ్గం వర్క్‌పై శిక్షణ తరగతులు బుధవారం నుంచి ప్రారంభించారు. దివాన్‌చెరువుకు చెందిన డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ప్రారంభించినట్టు మేనేజింగ్ ట్రస్టీ సుంకర వీరాస్వామి తెలిపారు. ఈ సందర్భంగా వినయ్ సుంకర పౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 50 మంది మహిళలు శిక్షణకు హాజరయ్యారన్నారు. తోకాడ గ్రామానికి చెందిన దుర్గాదేవి, చందు శిక్షకులుగా వ్యవహరిస్తారని చెప్పారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



బలభద్రపురంలో స్వామివారి గ్రామోత్సవం చేస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో శ్రీదేవీ, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ 9వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. విఘ్నేశ్వర పూజ, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, దీక్షాధారణ, గోపూజ, మండ ఆరాధనలు, లక్ష్మీ పూజ, పూర్ణాహుతి, అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి గ్రామ పురవీధుల్లో స్వామి వారి రథోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మల్లిడి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా.. నాణ్యతగా..



వెదుళ్లపల్లి వద్ద జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులు



ముగ్గళ్ల వద్ద నాలుగు లేన్ల రహదారి

- చురుగ్గా రాజమహేంద్రవరం - సీతానగరం రోడ్డు పనులు
- పర్యవేక్షిస్తున్న అధికారులు

సీతానగరం: రాజమహేంద్రవరం - సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డు నాలుగు లైన్ల విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. శిథిలమైన ఈ రోడ్డుతో గతంలో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగా నాలుగు లైన్‌ల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. దీంతో ప్రజలకు సుఖవంతమైన ప్రయాణం అతి దగ్గరలోనే ఉంది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఈ రోడ్డు పనులకు రూ.70 కోట్ల నిధులు తీసుకువచ్చారు. కాతేరు నుంచి సీతానగరం వరకు 18.2 కిలోమీటర్లు పొడవున నాలుగు లైన్‌ల రోడ్డుకు అంచనా విలువ రూ.70 కోట్లు కాగా, మరో రూ.35 కోట్లు అవసరమవుతాయని ముఖ్యమంత్రి జగన్‌తో చర్చించారు.

సిమెంట్ రోడ్ల పనులు

కాతేరు నుంచి సీతానగరం వరకు గ్రామాల వద్ద డ్రైనేజీలు ఏర్పాటు చేసి, సిమెంట్ రోడ్లు వేస్తారు. ఈ విధంగా సిమెంట్ రోడ్డు పరిధి 10.5 కిలోమీటర్లు ఉంటుంది. బొబ్బిల్లంక వద్ద ఒక వైపు సిమెంట్ రోడ్డు పూర్తయ్యింది. మునికూడలి, జాలిమూడి, వెదుళ్లపల్లి, ఇనుగంటివారిపేట, ముగ్గళ్లలో సిమెంట్ రోడ్డు వేయడానికి పనులు జరుగుతున్నాయి. జూలై నెలాఖరుకు ఈ రోడ్డును ఒక రూపానికి తీసుకువస్తానని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు.

జక్కంపూడి రాజా కృషితో..



బొబ్బిల్లంక వద్ద ఒక వైపు సిమెంట్ రోడ్డు పూర్తయ్యింది. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు ఏర్పాటు చేశారు. మరో వైపు సిమెంట్ రోడ్డు వేయాలి. దాని పనులు త్వరలో ప్రారంభిస్తారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో ఈ రోడ్డు అభివృద్ధి జరుగుతోంది.

– బదుగు సురేంద్ర, బొబ్బిల్లంక

ముగ్గళ్లకు కొత్తందం



వర్షాకాలంలో ముగ్గళ్లలో వాహనాలు వెళ్లడానికి కష్టంగా ఉండేది. వర్షాలు తగ్గాక రోడ్డు పనులు వేగవంతంగా జరిగాయి. నాలుగు లైన్ల రోడ్డుపై వెట్‌మిక్స్ వేశారు. త్వరలో ఇక్కడ పనులు మొదలవుతాయి. రోడ్డు విస్తరణతో ముగ్గళ్ల గ్రామానికి కొత్తందం వచ్చింది.

– సాదె చంటిబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు, ముగ్గళ్ల

అన్నిరంగాల అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం



గాదరాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- గాదరాడలో గడప గడపకూ..

మధురపూడి: రాష్ట్రంలో అన్నిరంగాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నట్టు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు అక్కచెల్లెమ్మలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ నాడు - నేడు పథకం ద్వారా పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించారన్నారు. అలాగే వ్యవసాయానికి సంబంధించి విత్తు నుంచి విక్రయం వరకూ రైతులకు అన్నివిధాలుగా జగన్ ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం సాయంత్రం వరకూ జరిగింది. ఈ సందర్భంగా సుమారు వంద గడపలకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో హరిబోలు చిన బాబు, తోరాట శ్రీను, నాగ విష్ణు, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



మృతుడి కుటుంబానికి బీమా సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: మండలంలోని సీతారామపురానికి చెందిన అడబాల నారాయుడు మృతి చెందడంతో అతడి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా మంజూరయ్యే రూ. లక్ష ఆర్థిక సాయంలో రూ.10 వేలను తక్షణ సాయంగా బుధవారం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా.. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ఈ సాయాన్ని అందించారని వైఎస్సార్ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అడబాల చినబాబు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సూరపురెడ్డి పెద గొల్లబ్బాయి, ఎంపీటీసీ సభ్యుడు నాగమళ్ల పండు, గ్రామ సచివాలయ కమిటీ కన్వీనర్ మేడిశెట్టి కాపు, గృహసారథులు తుమ్మల గంగరాజు, బంతికోటి ముత్యాలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా



కరకుదురు రైతు భరోసా కేంద్రంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలాక్కియా

పెదపూడి: రాష్ట్ర ప్రభుత్వం మధ్యవర్తుల ప్రమేయం లేకుండా తీసుకొచ్చిన పారదర్శకత కోసం తీసుకొచ్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలాక్కియా రైతులకు సూచించారు. మండలంలో కరకుదురు, దోమాడ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, పెదపూడిలో రైసుమిల్లు, దోమాడలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో రాళ్ల ఏర్పాటు ప్రక్రియ పనులను, పలు రికార్డులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల నుంచి రైతులకు అందుతున్న సేవలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చన్నారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సమగ్ర భూసర్వే పనులు పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, ఏఓ టీవీఆర్ మణిదీప్, ఆర్ఐ ఎం.త్రివేణి, వీఆర్వోలు భాగయ్య, సునీత, గణపతి తదితరులు పాల్గొన్నారు.

3000 మందికి మధుమేహ పరీక్షలు పూర్తి



మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 3000 మందికి మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు పూర్తి చేశామని క్లబ్ మెంటర్ మండ రాజారెడ్డి తెలిపారు. జి.మామిడాడ గ్రామంలో 70 రోజులుగా ఇంటింటికి తిరిగి ప్రజలకు చేస్తున్న మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షల ప్రక్రియ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ సమాజంలో తెలియకుండా ప్రబలుతున్న మధుమేహ వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం లయన్స్ సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమం అద్భుతమైనదన్నారు. ఈ పరీక్షల్లో 400 మందికి కొత్తగా మధుమేహ వ్యాధి ఉన్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో రాయుడు వీర్రాఘవులు, పప్పు రామకృష్ణారెడ్డి, ఆర్ఏఆర్‌కే చౌదరి, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

670 మందికి వైద్య సేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని సింగవరంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 670 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. ఎంపీయూపీ స్కూలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మట్ట శ్రీనివాస్, చిర్ల పోశియ్య, గంగాధర్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుధాకర్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

సీతానగరం: గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశామని కోరుకొండ సీఐ జి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీతానగరం ఇన్‌చార్జి ఎస్సై ఎంవీఆర్ రెడ్డికి అందిన సమాచారం మేరకు సీతానగరం మండలం నల్గొండ శివారున ఉన్న మెట్ట గంగాలమ్మ గుడి దగ్గరలో వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. కోరుకొండ మండలం కోటికేశవరం వైపు నుంచి రాపాక వైపునకు మోటారు సైకిల్‌పై గంజాయి మూటను పట్టుకు వస్తున్న గోకవరం మండలం కృష్ణుడుపాలేనికి చెందిన గుడెల భార్గవ (బన్నీ), సీతానగరం మండలం రాపాకకు చెందిన వెన్న సందీప్, చినకొండేపూడికి చెందిన సుందరపల్లి సందీప్ (శాండీ)లను అరెస్ట్ చేశామన్నారు. వారినుంచి స్వాధీనం చేసుకున్న 21.205 కిలోల గంజాయిని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ సమక్షంలో సీజ్ చేశామన్నారు. వెన్న సందీప్, సుందరపల్లి సందీప్ గంజాయికి అలవాటుపడ్డారని, వీరు గోకవరం నుంచి గంజాయి కొనుగోలు చేసి సీతానగరం చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయాలు జరుపుతున్నారన్నారు. కృష్ణుడుపాలేనికి చెందిన భార్గవ గోకవరం చుట్టుపక్కల గ్రామాల్లో గంజాయి అమ్ముతున్నాడన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో గైట్ విద్యార్థికి పతకాలు



సాయికుమార్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

రాజానగరం: గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ ఫస్టియర్ చదువుతున్న ఏ.సాయికుమార్ రాష్ట్ర స్థాయిలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో వెండి, కాంస్య పతకాలు సాధించాడు. విశాఖపట్నంలో రెండు రోజుల క్రితం నిర్వహించిన ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి ఈ పతకాలను అందుకున్నాడని ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని, కోచ్‌ను కళాశాల యాజమాన్యం అభినందించింది.

నిస్వార్థ నాయకుడు మాజీ ఎమ్మెల్యే తేతలి రామారెడ్డి



మాజీ ఎమ్మెల్యే తేతలి రామారెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

అనపర్తి: మాజీ ఎమ్మెల్యే తేతలి రామారెడ్డి ప్రజలకు నిస్వార్థంగా సేవలందించిన నాయకుడని పలువురు వక్తలు కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే తేతలి రామారెడ్డి 88వ జయంతి సందర్భంగా స్థానిక వీరుళ్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న చిన్నబ్బాయి విగ్రహానికి బుధవారం ఆయన కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త తేతలి రాధాకృష్ణారెడ్డి, తేతలి నారాయణరెడ్డి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనపర్తి: అనపర్తి, పీరారామచంద్రపురం, కుతుకులూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల్లో 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ లైన్ల మరమ్మతుల పనుల నిమిత్తం ఈ నెల 28వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు రామచంద్రపురం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉపాధి హామీ పనులు వేగవంతం



ముగ్గళ్లలో పంట కాలువ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ జ్యోత్స్న

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పథకం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అన్నారు. ముగ్గళ్ల సుద్దమెట్ట వద్ద ఉపాధి పథకంలో జరుగుతున్న పంటకాలువ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. కూలీల మస్తర్లు పరిశీలించారు. వంద రోజుల పని దినాలు కూలీలకు కల్పించాలని ఏపీవో నాగ శేషవేణికి సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు గోలి ధర్మరాజ్, తానేటి జ్యోతి, గుర్రాల కృష్ణారావు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రం తనిఖీ



మూల్యాంకన కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో పదో తరగతి పేపర్ల స్పాట్ వాల్యూషన్ అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలోని మూల్యాంకన కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసే బాధ్యతను ఆయా జిల్లాల విద్యాశాఖాధికారులు చూడాలన్నారు. మూల్యాంకన వివరాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం వివరించారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి



నగరంలో పర్యటిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న కట్టడాలను తక్షణమే కూల్చివేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశించారు. మహావీర్ స్ట్రీట్, మెరక వీధి, ఇన్నీస్ పేట, గెయిల్ ఆఫీస్ వద్ద జరుగుతున్న అక్రమ నిర్మాణాలను బుధవారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరపాలక సంస్థ అనుమతినిచ్చిన ప్లాన్ ప్రకారం మాత్రమే నిర్మాణాలు జరగాలన్నారు. ప్లాన్‌కు తగ్గట్టుగా లేని అక్రమ కట్టడాలను కూల్చి వేయడమే కాకుండా, భవన యజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సిటీ ప్లానర్ సూరజ్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

రేపు విజయదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో కొలువైన విజయదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం 28వ తేదీన ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లుగా ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. శుక్రవారం అమ్మవారిని విశేషంగా అలంకరించి అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి ఆలయం వద్ద మహాన్నదానం నిర్వహించనున్నారు.

నేడు కొబ్బరి, పామాయిల్ రైతులకు శిక్షణ

రంగంపేట: మండల పరిధిలోని జి.దొంతమూరులో గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు కొబ్బరి, పామాయిల్ తోటల రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల ఉద్యానవన అధికారి దివ్య తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ కొబ్బరి, పామాయిల్ సాగు ఆకులను ఆశించే రూగోస్ తెల్లదోమ నివారణకు తీసుకోవలసిన చర్యలను వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలియజేస్తారన్నారు. రంగంపేట, రాజానగరం మండలాలకు సంబంధించిన కొబ్బరి, పామాయిల్ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీతానగరం కళాశాలలో 48 శాతం ఉత్తీర్ణత

సీతానగరం: సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 93 మందికి 45 మంది పాసయ్యారని, కళాశాలల 48 శాతం ఉత్తీర్ణత సాధించిందని ప్రిన్సిపాల్ సీహెచ్ దొరబాబు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 40 మందికి 20 మంది, బైపీసీలో 50కి 18 మంది, సీఈసీలో 27 మందికి 15 మంది పాసయ్యారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 44 మందికి 21, బైపీసీలో 26కి 10 మంది, సీఈసీలో 23 మందికి 13 మంది ఉత్తీర్ణులైయ్యారన్నారు. ఒకేషనల్ కోర్స్‌లో ప్రథమ సంవత్సవరం 40 మందికి 13 మంది, సెకండియర్‌లో 53కు 21 మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు.